అన్నలను మెప్పించిన కేసీఆర్ సంక్షేమం

- ఆదివాసీ గ్రామాలకూ అభివృద్ధి ఫలాలు
- పదేండ్లు ప్రశాంతంగా తెలంగాణ రాష్ట్రం
- కేసీఆర్ ప్రభుత్వ విధానాల నేపథ్యంలో వందలాది మంది నక్సలైట్ల లొంగుబాటు
- రైతుబంధు, బీమాతో పెరిగిన ధీమా
- గిరిజన, ఆదివాసీల రిజర్వేషన్లు పెంపు
- అటవీ, భూముల పరిరక్షణకు కంకణం
- ఆపరేషన్ కగార్‌ను ఆపాలన్న కేసీఆర్ డిమాండ్‌కు అన్నివర్గాల నుంచి మద్దతు

అడవి గుండెల్లో అభివృద్ధి గానం వినిపించింది. అరణ్య గర్భాన ప్రగతి ఫలాలు పరిఢవిల్లాయి. కొండల్లో, కోనల్లో, గిరిజన తండాల్లో, అణగారినవాడల్లో అన్నల అభివృద్ధి ఎజెండా రెపరెపలాడింది. ఉమ్మడి పాలనలో అన్యాయాలు, అక్రమాలను చూసి వనవాసానికి పూనుకున్న అన్నలు సైతం.. బీఆర్ఎస్ హయాంలో ప్రతీ పల్లెలో వికసించిన ప్రగతి ఫలాలు చూసి జనజీవన స్రవంతిలోకి అడుగుపెట్టారు. నాడు ఉమ్మడి పాలనలో అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ గూడేలు, గిరిజన తండాలు, అటవీప్రాంత గ్రామాలు.. స్వరాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన అన్నల ఎజెండాకు సలామ్ కొట్టాయి. ఉమ్మడి పాలనలో అభివృద్ధి కోసం ఆయుధాలెత్తిన వారు.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి అరణ్యవాసాన్ని వీడారు. నాడు జరిగిన అభివృద్ధిపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.



> నిరుపేదలకు ఆహారం, ఇల్లు లేని వారికి ఇల్లు, బలహీనులకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే న్యాయమైన డిమాండ్ల సాధనకు నక్సలైట్లు పోరాడుతున్నందున.. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ నక్సలైట్ల ఎజెండానే అమలు చేస్తాం.
>
> -తెలంగాణభవన్ వేదికగా మలిదశ ఉద్యమ సారథిగా 15 ఏండ్ల క్రితం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలివి

> నేను మీకొక విషయం స్పష్టం చేయాలె.. తెలంగాణలో నక్సలిజం పెరిగింది. తెలంగాణ ప్రజలంటే తుపాకులు చేతిలో పట్టుకొనే పుడుతారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలంగాణలో నక్సలిజం పెరిగిపోతది. పరిశ్రమలు రావు, పెట్టుబడులు ఉండవు.. మళ్లీ తెలంగాణలో కరువు తాండవిస్తది అని వితండవాదం చేస్తున్నారు. మనం స్వరాష్ట్రం సాధించుకుంటే చిన్నరాష్ట్రం అయితది. మనమే నక్సలైట్ల ఎజెండాను అమలు చేస్తే.. ఇక నక్సలిజం ఎక్కడుంటది? తెలంగాణ సాధిస్తే నేను చేసే పని అదే.
>
> -దుబ్బాక లో ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ ప్రభాకర్‌రెడ్డి నాడు బీఆర్ఎస్‌లో చేరిక సందర్భంగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఎన్‌కౌంటర్లు, రక్తపాతాల ద్వారా నక్సల్ సమస్య పరిష్కారం కాదని, మారుమూల ఆదివాసీ గ్రామాలకు సైతం సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడం ద్వారా, మానవీయ కోణంలో ప్రభుత్వ సేవలను అందించడం ద్వారానే మౌలిక మార్పు సాధ్యమని కేసీఆర్ తన పాలనాకాలంలో రుజువు చేశారు. మలిదశ ఉద్యమం సాగుతున్న రోజుల్లో స్వరాష్ట్రం సిద్ధిస్తే అన్నల ఎజెండాను అమలు చేస్తామని చెప్తూ వచ్చిన కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధపడి సాధించిన స్వరాష్ట్రంలో బృహత్తరమైన అభివృద్ధి పనులు చేపడుతూ మాట నిలుపుకున్నారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న మారణకాండను ప్రతిపక్షనేతగా నిరసించారు. కేసీఆర్ చేసిన ప్రకటనకు సబ్బండ వర్ణాల నుంచి మద్దతు లభిస్తున్నది. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ ప్రభుత్వ పాలన ఉండటంతో రాష్ట్రంలోని ప్రజలందరి జీవన ప్రమాణాలు పెరిగాయి. 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో తెలంగాణలో అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ గూడేలు, గిరిజన తండాలు, అటవీప్రాంత గ్రామాలు స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇతర గ్రామాలతో అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి. నాడు కేసీఆర్ ప్రభుత్వమే తెలంగాణకు హరితహారం పేరుతో అటవీ, భూముల సంరక్షణకు పూనుకున్నది. వెరసి నక్సలిజం వైపు మొగ్గుచూపే వారి సంఖ్య తగ్గిపోయింది.

స్వరాష్ట్రంలో వీడిన వనవాసం

కోరి, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సబ్బండ వర్ణాలకు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను చూసి, అనేక మంది నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిశారు. 2018 నుంచి 2022 వరకు దాదాపు 250 మంది లొంగిపోయారు. వీరిలో 65 మంది మెయిన్ క్యాడర్ నేతలు ఉన్నారు. ఒక్క 2022లోనే సుమారు 35 మంది లొంగిపోయారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 550 మందికిపైగా అరణ్యవాసం వీడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అందించిన ప్రజారంజక పాలనను చూసి, మావోయిస్టు ముఖ్యనేతలంతా ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు మకాం మార్చారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్

తెలంగాణలో నక్సల్ ప్రభావిత జిల్లాలైన కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'కమ్యూనిటీ పోలీసింగ్'ను పక్కాగా అమలు చేశారు. ఆదివాసీ, గిరిజన గ్రామాల్లోని ప్రజల కోసం రోడ్లు, మంచినీరు, విద్యుత్తు, జలశుద్ధి యంత్రాలు, పిల్లలు చదువుకునేందుకు వసతులు, యువతకు ఉపాధి కల్పన, క్రీడా మైదానాల ఏర్పాటులో పోలీసులు, గ్రేహౌండ్స్ దళాలు కేసీఆర్ ఆదేశాల మేరకు పటిష్టంగా పని చేశాయి.

లొంగిపోయిన వారికి పునరావాస పథకం

జనజీవన స్రవంతిలో కలిసిన వారి కోసం కేసీఆర్ ప్రభుత్వం పునరావాస పథకాన్ని పక్కాగా అమలు చేసింది. ఇంటి పట్టా, వ్యవసాయ భూమి, వ్యాపారం చేసుకునేందుకు రుణాలు ఇవ్వడం, వసతులు కల్పించడం, వారిపై ఉన్న చిన్న చిన్న కేసులు కొట్టివేయడం వంటి కార్యక్రమాలు అమలయ్యాయి.

తగ్గిపోయిన కొత్త రిక్రూట్‌మెంట్లు

మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండే ఆరు జిల్లాల్లో తాగునీరు, వైద్యం, విద్య, గురుకులాలు, వ్యవసాయ, రవాణా సౌకర్యాలను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కల్పించింది. ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతరులు సైతం మార్పు దిశగా పయనించారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే.. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులు సత్ఫలితాలను ఇవ్వడాన్ని అన్నలు సైతం స్వాగతించారు. యుక్త వయసులోనే ఉద్యమంలోకి అడుగుపెట్టేవారి సంఖ్య తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా తగ్గిపోయింది. అడవిలో క్షణక్షణం భయంతో చనిపోవడం కంటే.. ధైర్యంగా ఉద్యోగాలు చేస్తూ తమ వారికి సేవ చేయాలనే ఆలోచనతో వాపస్ వచ్చినవారి సంఖ్యే అధికంగా ఉన్నదని నిఘా వర్గాలు తెలిపాయి.

ఆ ఆరు జిల్లాల రైతుల్లో ధీమా!

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ రైతుకు రూ.5 లక్షలు బీమా సదుపాయం అందించి, రైతుల కుటుంబాలకు ధీమా ఇచ్చింది. రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించి, వ్యవసాయంలో నష్టాలపాలు కాకుండా కాపాడింది. నక్సల్ ప్రభావిత ఆసిఫాబాద్, కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సుమారుగా 4 లక్షల మంది రైతులున్నారు. వీరిలో ఎస్టీ రైతులు సుమారు 63 వేల మంది ఉన్నారు. 2018 నుంచి వీరికి రైతుబంధు అందించింది.

విద్య, వైద్యంపై దృష్టి

తెలంగాణ ట్రైబల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా అద్భుతమైన హాస్టల్ వసతితో నాణ్యమైన విద్యను అందించింది. గురుకులాల్లోని ఒక్కో విద్యార్థి కోసం కేసీఆర్ సర్కారు ఏటా సుమారు రూ.1.2లక్షలు ఖర్చు చేసింది. వీటికి తోడు ఏజెన్సీలో వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నది. ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. బిడ్డలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించింది.

ఉద్యోగాల కల్పనలోనూ ముందంజ

స్వరాష్ట్రం సాధించిన తర్వాత మన ఉద్యోగాలు మన ప్రాంత బిడ్డలకే చెందాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదేండ్లలోనే సుమారు 22 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించింది. 2022 నాటికే వివిధ రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా సుమారు లక్షా 35 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. ఆ తర్వాత పోలీసు కొలువులే 15వేల వరకు భర్తీ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం గిరిజన (ఎస్టీ) రిజర్వేషన్లను 6% నుంచి పది శాతానికి పెంచింది. దీంతో మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి.

మా లక్ష్యం నెరవేరుతున్నది

నాటి పరిస్థితులకు, నేటి పరిస్థితులకు చాలా తేడా ఉన్నది. కండ్లమందే బోలెడు అవకాశాలున్నాయి. మా బిడ్డలు గురుకులాల్లో చదువుతున్నారు. ప్రభుత్వం కల్పించిన వ్యవసాయ భూమిలో ఏటా రెండు పంటలు సాగు చేసుకుంటున్నాం. రైతుబంధు ఏడాదికి రూ.పదివేలు అందాయి. రైతుబీమాకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే డబ్బులు కట్టింది. అడవులను వదిలిన మాలాంటి కొందరు అన్నలు వ్యవసాయం, వ్యాపారం చేసుకుంటున్నారు. ఇప్పుడు నలుగురిలో గౌరవంగా బతుకుతున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో మా లక్ష్యం నెరవేరింది.

– జన జీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు దంపతులు

11 నెలల్లో 14 మంది నక్సల్స్ హతం

ఏడాది ప్రజాపాలనతో మావోయిస్టులపై ఉక్కుపాదం

16 మందిని చంపారంటున్న పౌరహక్కులు సంఘం

ప్రజాస్వామ్యం, ప్రజాహక్కుల పునరుద్ధరణే 7వ గ్యారెంటీగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అంటూనే తొలి ఏడాదిలోనే 14 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసింది. ఈ విషయాన్ని పోలీసు క్రైమ్ వార్షిక నివేదికలోనే అధికారికంగా వెల్లడించింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే మొత్తం 16 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా చిత్రహింసలు పెట్టి హతమార్చినట్టు పౌరహక్కుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. ప్రజాస్వామ్యం పునరుద్ధరణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఈ తరహాలో మోసం చేస్తుందని ఊహించలేకపోయామని ప్రజా సంఘాలు, పౌరహక్కుల నేతలు అంటున్నారు. కోవర్టుల ద్వారా మత్తుమందు పెట్టి మరీ మావోయిస్టులను హతమార్చుతున్నారని, వారిని అరెస్టు చేసి, కోర్టు ఎదుట హాజరుపర్చకుండా ఎన్‌కౌంటర్ల పేరుతో వారి జీవించే ప్రాథమిక హక్కును పోలీసులు ఎలా కాలరాస్తారని ప్రశ్నిస్తున్నారు. కాగా, బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేవలం ఇద్దరు మావోయిస్టులు మాత్రమే ఎన్‌కౌంటర్‌కు గురయ్యారు.

లోకం పోకడ



రిజల్ట్‌లో తేడా వచ్చిందో వీపు చీరేస్తా. నీకు 95 పర్సెంట్ మార్కులొస్తే.. నేను రవ్వల నెక్లెస్ కొనుక్కుంటానని మొక్కుకున్నా!

రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఆపరేషన్ కగార్

సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో నారాయణ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ ఆపరేషన్ కగార్ పేరుతో సమయం నిర్దేశించి మరీ మావోయిస్టులను భౌతికంగా నిర్మూలిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో వామపక్ష శక్తులు బలహీనపడటంతో మతోన్మాద బీజేపీ చెలరేగిపోతున్నదని, దీనిని కట్టడి చేయడానికి కమ్యూనిస్టులు మరింతగా బలోపేతం కావాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. బీజేపీకి అధికార దాహం తప్ప.. దేశంపై కానీ, ప్రజలపై కానీ ఎలాంటి ప్రేమ లేదని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో జరిగాయి. సీపీఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయించండి

సీతక్కకు భారత్ బచావో సంస్థ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉన్నదని, ప్రాణనష్ట నివారణకు కృషిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్కకు భారత్ బచావో సంస్థ విజ్ఞప్తిచేసింది. ప్రజాభవన్‌లో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, జంజర్ల రమేశ్‌బాబు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా మీ వంతుగా చొరవ చూపాలని కోరారు. వేల సంఖ్యలో కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. సంస్థ ప్రతినిధుల వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని సూచించారు.

ఇద్దరు ఐజీలకు పదవీకాలం పొడిగింపు?

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎక్సైజ్‌శాఖలో ఐజీ ర్యాంకు అధికారి వీ కమలాసన్ రెడ్డి పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఎక్సైజ్‌శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదవీ కాలం నేటి (బుధవారం)తో ముగియనున్నది. ఆయన ఆధ్వర్యంలో పటిష్ఠంగా మారిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్.. పోలీసుశాఖకు దీటుగా డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కృషి చేస్తున్నది. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు డైరెక్టర్‌గా మెడికల్ షాపుల్లో నకిలీ మందులను కనుగొని అక్రమార్కులపై కొరడా ఝుళిపించడంలో కూడా కీలకంగా వ్యవహరించారని పేరుంది. దీంతో ఆయన సేవలను మరింతగా వాడుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. తెలంగాణ పోలీసుశాఖకు విశేష సేవలందించిన మరో ఐజీ ర్యాంకు అధికారి సత్యనారాయణ కూడా జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన సర్వీస్‌ను కూడా ప్రభుత్వం పెంచే అవకాశమున్నట్టు తెలిసింది. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహాం పదవీ కాలాన్ని కూడా పొడిగిస్తారనే ప్రచారం జరుగుతుంది. ఒకవేళ ఆయన పదవీకాలం పొడిగించకపోతే సీనియార్టీ ప్రకారం ఆదిలాబాద్ డిపో మేనేజర్ అశోక్ ఆ స్థానానికి వచ్చే అవకాశం ఉంది.

వెళ్తూ.. వెళ్తూ అనుకున్నవారికి అందలం!

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): వెళ్తూ.. వెళ్తూ తన అనుయాయులను అందలం ఎక్కించారు ఓ ఉన్నతాధికారి. ఉద్యోగ విరమణ చేయబోయే ముందే తనను నమ్ముకున్న వారికి నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్ ఇచ్చారు. న్యాయంగా ప్రమోషన్లు రావాల్సినవారిని నాలుగు నెలలు తిప్పించి ప్రమోషన్ ఇవ్వకుండానే వెనక్కి పంపినట్టు ఆయనపై ఆరోపణలున్నాయి. కానీ ఒక్కరికి మాత్రం సచివాలయానికి బదిలీ చేశారు. అటవీ శాఖలో పనిచేసే సీనియర్ స్టెనోగ్రాఫర్ ఒకామెకు సెక్రటేరియట్‌లో నియామకం కల్పించారు. ఇందుకోసం కొన్ని నిబంధనలను సరళీకరించి, ప్రత్యేక కేసుగా పరిగణించి, ఈ మేరకు పోస్టింగ్ ఇస్తూ ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేశారు. అర్హతలు కలిగిన పలువురు అభ్యర్థులు పోస్టింగుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆ ఉన్నతాధికారి ఆశీర్వాదం ఆమె ఒక్కరికే దక్కడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని ఆదివాసీ, దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు, మహిళలు, చిన్నపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. -హనుమకొండ చౌరస్తా

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- తక్షణమే కేంద్రం మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలి
- పది వామపక్ష పార్టీల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఆదివాసీ జాతిని హననంచేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయడంతోపాటు తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో బేషరతుగా శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. దాదాపు 20 వేల మంది పోలీసు బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టి నరమేధం సృష్టించడం దుర్మార్గమని ఆయా పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కర్రెగుట్టల నుంచి పోలీసు క్యాంప్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సాధినేని వెంకటేశ్వరరావు, గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కేజీ రాంచందర్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ-ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి ఏ జానకి రాములు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా, ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురారి, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకుడు ప్రసాద్ తదితరులు మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరపాలన్న డిమాండ్‌తో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. సదస్సులో అన్ని పార్టీలు, వర్గాల అభిప్రాయాల మేరకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎంఈసీఎఫ్ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న మేనేజర్లు, రెవెన్యూ అధికారుల పదోన్నతులతోపాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల కేంద్ర సంఘం (టీఎంఈసీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నేతలు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ అధికారుల పదోన్నతుల విషయంలో మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట గోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తమ పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపిందని, జూన్ 24వ తేదీకి వాయిదా వేసినట్టు వెల్లడించారు. డైరెక్టర్ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల సమస్యల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. సంఘం తరపున ఉద్యోగుల సమస్యలపై నిలదీస్తే వారిని టార్గెట్ చేస్తున్నారని తెలిపారు.

ఆర్ఆర్‌బీ పరీక్షలను సజావుగా నిర్వహించండి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ రైల్వే ఆధ్వర్యంలో మే 2 నుంచి 6 వరకు నిర్వహించనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలను సజావుగా నిర్వహించాలని మంగళవారం సంబంధిత అధికారులను ఎస్‌సీఆర్ జీఎం ఆదేశించారు. ఆర్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షలకు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీలో మొత్తం 11,588 పోస్టులు ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయ విద్యుత్తుకు మీటర్లు!

మొదటిపేజీ తరువాయి...

అమలుచేయనున్నట్టు తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి డిస్కంలు తాజాగా సమాచారాన్నిచ్చాయి. ఇదే విషయాన్ని ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున మంగళవారం ధ్రువీకరించారు. అంటే.. అతి త్వరలో రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్తుకు మీటర్లు రాబోతున్నాయన్నమాట. మీటర్లు పెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2021 నుంచి చేస్తున్న ప్రయత్నాలకు కేసీఆర్ అడ్డుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచి స్వాగతిస్తున్నది.

నాడు గర్జించిన కేసీఆర్

ఆర్‌డీఎస్ఎస్ అనేది కేంద్రం అమలు చేస్తున్న పథకం. విద్యుత్తు సంస్కరణల పేరుతో 2021లో దీనిని రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా వ్యవసాయానికి వినియోగిస్తున్న కరెంటును మీటర్లు పెట్టి లెక్కించాల్సి ఉంటుంది. ఆ మీటర్లకు బిల్లులు తీసి వసూలు చేయాలి. ఈ ప్రతిపాదనకు ఒప్పుకున్న రాష్ట్రాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి అదనంగా 0.5 శాతం రుణాలు తీసుకునేందుకు అనుమతి ఇస్తుంది. అయితే, ఈ విద్యుత్తు సంస్కరణల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేసీఆర్ గ్రహించారు. మోటర్లకు మీటర్లు పెట్టబోమని స్పష్టం చేశారు. 'తల తెగిపడినా మీటర్లు పెట్టేది లేదు' అని అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. మీటర్లు పెడితే రాష్ట్రానికి ఏటా రూ.5 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.25 వేల కోట్లు సమీకరించుకునే అవకాశం ఉండేది. కానీ రైతుల ప్రయోజనాల కన్నా రూ.25 వేల కోట్లు ఎక్కువ కాదంటూ కేసీఆర్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. దేశవ్యాప్తంగా ఒక్క కేసీఆర్ మాత్రమే రైతుపక్షపాతిగా మోటర్లకు మీటర్లను వ్యతిరేకించారు. ఏకంగా పార్లమెంటరీ కమిటీ ముందు తెలంగాణ ఇదే వాదనలు వినిపించింది. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఒప్పుకున్నారు. తెలంగాణలో వ్యవసాయ విద్యుత్తును కొలిచేందుకు మీటర్లు పెట్టకుండా కేసీఆర్ అడ్డుకున్నారని ఓ సందర్భంలో చెప్పారు. మీటర్లు పెట్టేందుకు కేసీఆర్ ఒప్పుకోలేదని అందుకే తెలంగాణకు నిధులు ఇవ్వలేదని చెప్పారు.

కేవలం రూ.6వేల కోట్లకు ఆశపడి!

నాడు కేసీఆర్ రైతు ప్రయోజనాల కోసం రూ.25 వేల కోట్లను కాదనుకోగా, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.6 వేల కోట్లకు ఆశపడి వ్యవసాయ విద్యుత్తుకు మీటర్లు పెట్టేందుకు సిద్ధమైంది. కేంద్రం 'రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్' (ఆర్‌డీఎస్ఎస్)ను